క్లుప్తంగా

దుగ్గిరాలకు రెండో ఎంఈవో నియామకం


లక్ష్మీనారాయణ

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండలానికి రెండో విద్యాశాఖ అధికారిగా కె. లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన వేమూరి ఎంఈవోగా పనిచేశారు. ప్రస్తుతం దుగ్గిరాలలో రెండో ఎంఈవోగా బాధ్యతలు చేపట్టారు.

రూ. 9.5 లక్షతో డొంక రోడ్డు నిర్మాణం

తాడేపల్లి రూరల్ : ఉండవల్లి దళితవాడ రైతులు రాకపోకలు సాగించేందుకు మరో గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని సోమవారం ఎంటీఎంసీ అధికారులు చేపట్టారు. ఇటీవల ఎమ్మెల్యే ఆర్కేను ఉండవల్లికి చెందిన రైతులు ఉండవల్లి కరకట్ట వెంబడి పంట పొలాల్లోకి వెళ్లడానికి రోడ్డు నిర్మించాలని కోరారు. దీంతో 650 మీటర్ల పొడవునా ఐదు మీటర్ల వెడల్పున రూ. 9.5 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మరో రెండు, మూడు రోజుల్లో పనుల్ని పూర్తి చేయనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

ఉండవల్లి గుహలను సందర్శించిన క్యాడెట్లు



తాడేపల్లి రూరల్ : ఎన్‌సీసీ క్యాడెట్లు సోమవారం ఉండవల్లి గుహల్ని సందర్శించారు. ఈ సందర్భంగా 25వ బెటాలియన్ కల్నల్ సి.ఎస్. సిద్ధు మాట్లాడుతూ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ ఏపీ 25వ బెటాలియన్ ఆధ్వర్యంలో పంజాబ్, మహారాష్ట్ర, హర్యాణా, చండీగఢ్, ఢిల్లీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఏపీలోని కేఎల్, నాగార్జున యూనివర్సిటీలతో పాటు పలు విశ్వవిద్యాలయాలకు చెందిన 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు సందర్శించినట్లు వివరించారు. విద్యార్థులకు పర్వతారోహణ, ట్రెక్కింగ్, పరుగు, వక్తృత్వ పోటీల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్ యూనివర్సిటీకి చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ యస్విని ఉండవల్లి గుహల చారిత్రక ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

నేడు తాడేపల్లిలో యోగా దినోత్సవం

తాడేపల్లి రూరల్ : పట్టణ పరిధిలోని మానస సరోవర ధ్యాన ఆశ్రమం సిద్ధార్థ పిరమిడ్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆ ఆశ్రమం నిర్వాహకులు రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు తాడేపల్లి బైపాస్ రోడ్డులోని సీయస్ఆర్ కల్యాణ మండపంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 9849291372, 9866007469 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

టీడీపీ కుయుక్తులతో మందపాడులో దాహార్తి



మేడికొండూరు: మండలంలోని మందపాడులో దాహం కేకలు మిన్నంటాయి. ప్రజల అవసరాల రీత్యా రెండు రక్షిత మంచినీటి చెరువులున్నాయి. వాటి అభివృద్ధి పనుల్ని సర్పంచ్ ఆవుల సంజీవరెడ్డి కొద్ది రోజుల కిందట ప్రారంభించారు. అయితే, అడుగడుగునా సాకులతో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డుకుంటున్నారు. పనులు జరిగితే వైఎస్సార్ సీపీకి మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో ప్రతిపక్ష పార్టీ నాయకులు ఈ దురాగతాలకు ఒడిగడుతున్నారు. దీంతో పనులు ఒక్కసారిగా నిలిచి పోయాయి. రెండు చెరువుల్ని మరమ్మతుల రీత్యా కొంతకాలం నుంచి ఎండబెట్టారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి మంచి నీటిని గ్రామానికి అందించే క్రమంలో పంచాయతీ కూడా తీర్మానం చేసింది. గ్రామస్తులకు మంచి నీటి కొరత సృష్టించి, ఇబ్బందులకు గురిచేసే విష రాజకీయ సంస్కృతి తెదేపా నాయకులు చేయడం తగదంటూ పలువురు మహిళలు సోమవారం బిందెలతో పనులు నిలిచిన చెరువు వద్దకు వచ్చి వినూతన్న రీతిలో నిరసన తెలిపారు. సర్పంచ్ ఆవుల సంజీవరెడ్డితో తమ గోడు చెప్పుకున్నారు.

30న రైతాంగ సమస్యలపై సీపీఎం ధర్నా

తాడేపల్లిరూరల్ : రైతాంగ సమస్యలపై ఈనెల 30న నిర్వహిస్తున్న చలో విజయవాడ మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు, ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలు రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరిచాయని, ప్రభుత్వం ఎటువంటి సహాయక చర్యలు చేపట్టలేదని విమర్శించారు.

నెలాఖరుకు చేనేత మగ్గం షెడ్లు పూర్తి చేయాలి

- అధికారులకు ఎమ్మెల్యే ఆర్కే సూచన
- ఎమ్మెల్సీ మురుగుడుతో కలసి నగరంలో విస్తృత పర్యటన
- పలు అభివృద్ధి పనుల పరిశీలన


షెడ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: నగరంలోని రాజీవ్ గృహకల్ప ఆవరణలో తుది దశకు చేరుకున్న చేనేత మగ్గం షెడ్ల నిర్మాణాల్ని ఈనెల చివరి నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులకు సూచించారు. సోమవారం ఆయన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. తొలుత నిడమర్రు రైల్వే గేటు వద్ద డంపింగ్ యార్డులో పనుల్ని పరిశీలించారు. రానున్న వారం రోజుల్లో డంపింగ్ యార్డు తరలింపు పూర్తి చేసి, ఆ ప్రాంతంలో పార్కు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆర్కే నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. అనంతరం కార్పొరేషన్ పరిధి చినకాకాని ఎస్సీ కాలనీలోని పునీత జోజప్ప దేవాలయం(సెయింట్ జోసెఫ్ చర్చి) ఆవరణలో రూ.15లక్షలతో చేపట్టిన గ్రౌండ్ లెవలింగ్ పనుల్ని పరిశీలించారు. గతంలో లోతట్టు ప్రాంతంగా ఉన్న చర్చి ఆవరణను లెవలింగ్ చేయించడంతో తమ ఇబ్బందులు తీరాయని భక్తులు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నగరంలోని రాజీవ్ గృహకల్ప ఆవరణలో తుదిదశకు చేరుకున్న చేనేత మగ్గం షెడ్ల నిర్మాణ పనుల్ని పరిశీలించారు. గుంత మగ్గాలు, స్టాండ్ మగ్గాల ఏర్పాటు ప్రక్రియను అధికారులతో కలసి ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల చివరి నాటికి చేనేత మగ్గాల షెడ్ల నిర్మాణాలను పూర్తి చేసి, చేనేత సోదరులకు అందించేలా పనుల్ని వేగవంతం చేయాలని అధికారుల్ని కోరారు. రాజీవ్ గృహకల్ప ఆవరణలో నివాసం ఉంటున్న తమకు మగ్గం షెడ్లు త్వరలో అందుబాటులోకి రానుండటంతో ఇక తమ బాధలు తీరినట్లేనని, మగ్గం షెడ్ల నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆర్కేకు చేనేత కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆగమేఘాలతో ఈద్గా మెరక పనులు

అనంతరం తుది దశకు చేరుకున్న రజక, పద్మశాలి కమ్యూనిటీ భవన నిర్మాణాల్ని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాల్ని పూర్తి చేసి నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం కార్పొరేషన్ పరిధిలోని నవులూరు ఈద్గా ఆవరణకు చేరుకుని మెరక పనుల్ని పరిశీలించారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న ఈద్గా ఆవరణతో ఇబ్బందులు పడుతున్నామని, ఈనెల 29న బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రార్థనలు నిర్వహించుకునేందుకు వీలుగా మెరక పోయించాలని స్థానిక ముస్లింలు ఆదివారం ఎమ్మెల్యే ఆర్కేను కోరారు. స్పందించిన ఆయన వెంటనే ఈద్గా లెవలింగ్ పనులు చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. స్పందించిన అధికారులు రూ.3లక్షలతో ఈద్గా ఆవరణలో మెరక పనులు పూర్తి చేశారు. 24 గంటల వ్యవధిలో ఈద్గా ప్రాంగణంలో మెరక ఏర్పాటు చేయడంపై ముస్లింలు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ఈపూరి ఆదామ్, షేక్ హన్నన్, ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.

నగరంలో అపర కర్మల సత్రం నిర్మాణం


సత్రం నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పిండ ప్రదానాలకు అపర కర్మల సత్రం నిర్మించాలని నిర్ణయించుకున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. సోమవారం ఆయన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి నగరంలోని తెనాలి రోడ్డు పంప్ హౌస్ సమీపంలోని గుంటూరు చానల్ వద్ద స్థల పరిశీలన చేశారు. అనుకూల పరిస్థితుల్ని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరితగతిన షెడ్డు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం తుదిదశకు చేరుకున్న స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింక్ నిర్మాణ పనుల్ని పరిశీలించారు.

శ్రీశైలంనగర్ బీటీ రోడ్ల పరిశీలన

నగరంలోని శ్రీశైలం నగర్‌లో నిర్మిస్తున్న బీటీ రోడ్ల పనుల్ని ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ శ్రీశైలం నగర్‌లో కిలో మీటరు మేర విస్తరించిన బీటీ రోడ్డు రూ.1.40 కోట్ల వ్యయంతోనూ, ఆత్మకూరు పంచాయతీ కార్యాలయం నుంచి ఏపీఎస్పీ బెటాలియన్ అండర్ పాస్ సర్వీస్ రోడ్ వరకు 1.3 కిలో మీటర్ల మేర విస్తరించిన బీటీ రోడ్డును రూ.1.68 కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిశోర్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పని చేయాలి

కార్పొరేషన్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే ఆర్కే సూచించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి నగరంలోని కొప్పురావు కాలనీ విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఎంటీఎంసీ పరిధిలో పని చేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లతో, జేఎల్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో జూనియర్ లైన్‌మెన్లు పర్యటించాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు లోఓల్టేజీ సమస్యల్ని గుర్తించి తమతో పాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించడంలో సమస్యలు తలెత్తకుండా, సమన్వయంతో పని చేద్దామని తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కార మార్గాల కోసం ఎంటీఎంసీ పరిధిలో పనిచేస్తున్న జేఎల్ఎంలు, ఎనర్జీ అసిస్టెంట్లు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

అధికారుల సమీక్షలో సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న సురేష్ కుమార్

తాడికొండ: నియోజకవర్గంలో పనుల్ని త్వరితగతిన పూర్తిచేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమష్టి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ సూచించారు. గుంటూరు భారత్‌పేటలోని నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ పథకాల కింద మంజూరైన పనుల్ని ప్రాధాన్యతా ప్రాతిపదికన త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనా విధానాలకు అనుగుణంగా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల్లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులు, పురోగతి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు అత్తోట దీప్తి, కె. ప్రభాకరరావు, డి. అనూరాధ, బి. శివన్నారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య వివరాల నమోదు

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు సబ్‌సెంటర్ వద్ద సోమవారం ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఆరోగ్య సిబ్బంది నూతనంగా హెల్త్ కార్డులకు సంబంధించి ఆధార్ నంబర్‌తో ఫోన్ నంబర్ అనుసంధానం చేసి ఆరోగ్య వివరాలు నమోదు చేశారు. ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలు, బరువు, ఎత్తు, బీపీ పరీక్షలు చేసి వాటిని నమోదు చేశారు. ఇప్పటికే 92 శాతం వివరాలు నమోదు చేసినట్లు సిబ్బంది తెలిపారు.

వృద్ధురాలికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం


వృద్ధురాలికి సాయాన్ని అందజేస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి తదితరులు

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండలంలోని తుమ్మపూడికి చెందిన ఓ వృద్ధురాలికి మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే సోమవారం ఆర్థిక సాయాన్ని ప్రకటించి అందజేయించారు. ఈ సందర్భంగా దుగ్గిరాల ఎంపిపి దానబోయిన సంతోష రూపవాణి మాట్లాడుతూ తుమ్మపూడికి చెందిన వృద్ధురాలు సయ్యద్ నూర్జహాన్ కుమారుడు అంగవైకల్యంతో బాధపడుతున్నాడని, కుమార్తె మతిస్థిమితం లేకపోవడంతో ఇద్దరినీ పోషిస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ. 15 వేలను ప్రకటించి అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, బీసీ సెల్ అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, షేక్ బాషా, కుశల ప్రసాద్, కర్రే సుధాకర్, పఠాన్ బాజీ, పోపూరి హృదయరాజు, నల్లమామిడి తిరుమలరావు, చిట్టిబొమ్మ నరేంద్ర పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్ల అందజేత

దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి గ్రామానికి చెందిన నూతలపాటి సువార్తమ్మ, కొండూరు సుగుణమ్మ, షేక్ ఖలీల్‌లు అద్దె బండ్లపై చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) వారికి తోపుడు బండ్లు తయారు చేయించి నాయకుల ద్వారా అందజేయించారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపిపి దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

చిర్రావూరు – రేపల్లె కరకట్టకు మోక్షం

రూ. 2.63 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం

తాడేపల్లి రూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ చిర్రావూరు, గుండిమెడలను కలుపుతూ రేపల్లె కరకట్ట వరకు ఉన్న డొంక రోడ్డును బీటీగా నిర్మించేందుకు సోమవారం అధికారులు పనులు చేపట్టారు. చిర్రావూరు శివారు నుంచి గుండిమెడ పంట పొలాల్ని కలుపుకుంటూ 15 కి.మీ. పొడవునా నాలుగు మీటర్ల వెడల్పున రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అదే ప్రాంతంలో గుడిమెడను కలుపుతూ నాలుగు మీటర్ల వెడల్పు, 500 మీటర్ల పొడవునా రూ. 63 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. త్వరలోనే రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మంగళగిరి: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కార్పొరేషన్ పరిధి యర్రబాలెం యాదవుల వీధికి చెందిన చిమటా శేషయ్య (47) కుటుంబ కలహాలతో 15 రోజుల కిందట ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడ్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడే చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఎస్ఆర్ఎం- నిట్టే వర్సిటీల మధ్య ఒప్పందం


ఒప్పంద పత్రాలతో ఎస్ఆర్ఎం, నిట్టే యూనివర్సిటీల రిజిస్ట్రార్లు

మంగళగిరి: మంగుళూరులోని నిట్టే (ఎన్ఐటీటీఈ) డీమ్డ్ యూనివర్సిటీతో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. బయోలాజికల్ సైన్స్‌లో బోధన, పరిశోధనల్ని విస్తృతంగా అభివృద్ధి పర్చాలనే లక్ష్యంతో రెండు యూనివర్సిటీలు అవగాహనా పత్రాలపై సంతకాలు చేశాయి. మంగుళూరులోని నిట్టే యూనివర్సిటీలో ఈనెల 18న జరిగిన రెండు యూనివర్సిటీల సమావేశంలో ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. ప్రేమ్‌కుమార్, నిట్టే వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ హర్ష హలహళ్లిలు ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. దీనివల్ల రెండు యూనివర్సిటీల మధ్య పరిశోధనల పరంగా సత్సంబంధాలు పెరగడంతో పాటు విజ్ఞాన మార్పిడి, విద్యాపరమైన నైపుణ్యం అభివృద్ధి జరుగుతుందని నిట్టే యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య ఎం.ఎస్. మూడితయ్య పేర్కొన్నారు. ఎంవోయూల వల్ల రెండు యూనివర్సిటీల మధ్య బలమైన సృజనాత్మక పరిశోధనలు ఆవిష్కరణకు నోచుకుంటాయని, పరిశోధనా రంగ నిపుణుల సలహాలు, సూచనలు ఎంతో ఉపయుక్తంగా మారతాయని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఆర్ఎం బయోలాజికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జయశీలన్, నిట్టే యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణకుమార్‌తో పాటు పలువురు పరిశోధనా రంగ నిపుణులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ


విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సిద్ధయ్య

మేడికొండూరు: ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో, విద్యారంగంలో పెను మార్పులు తీసుకువచ్చి, పలురకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య పేర్కొన్నారు. మండలంలోని డోకిపర్రు ఎంపీయూపీ స్కూలులో సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో సిద్ధయ్య మాట్లాడుతూ పిల్లల చదువు భారం కాకూడదనే ఉద్దేశంతో నాణ్యత ప్రమాణాలతో ప్రభుత్వ పాఠశాలల్ని తీర్చిదిద్దిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని తెలిపారు. నాడు -నేడు పథకం ద్వారా పాఠశాలల స్వరూపాలే మారిపోయాయని, నూతన శోభలతో కొత్త హంగులతో ప్రతి గ్రామంలో దర్శనమిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండెపోగు సామ్రాజ్యం, ఎంపీటీసీ సభ్యుడు నోసిన రామకోటమ్మ, విద్యా కమిటీ చైర్మన్ ఉడతా ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడుబడిన బావిలోకి దూకి యువకుడి ఆత్మహత్య


గోపాల్ (ఫైల్)

మంగళగిరి: పాడుబడిన బావిలోకి దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కార్పొరేషన్ పరిధి యర్రబాలెం రైస్‌మిల్ వీధిలో చోటు చేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కార్పొరేషన్ పరిధి యర్రబాలేనికి చెందిన శిఖా శంకరరావు, రాజేశ్వరి దంపతుల మూడో కుమారుడు గోపాల్ (35)కు, గుంటూరుకు చెందిన అనూషకు పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి సాయి, చరణ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. గోపాల్ కొంతకాలం కిందట సెక్యూరిటీ గార్డుగా పని చేసినా, ప్రస్తుతం తాపీ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వేసవి ఎండల నేపథ్యంలో కొన్ని రోజులుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఏమి జరిగిందో తెలియదు గానీ గోపాల్ టవల్ కట్టుకుని ఇంట్లోంచి బయటకు వచ్చే క్రమంలో తండ్రి శంకరరావు అడ్డుకుని గేటు వేశాడు. అయినా గోపాల్ దాన్ని తొలగించి సమీపంలో ఉన్న ఓ పాడు బడిన బావిలోకి దూకేశాడు. కుటుంబ సభ్యులు బిగ్గరగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగువారు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నా ఎవరూ పాడు బడిన బావిలోకి దిగి గోపాల్‌ను కాపాడే సాహసం చేయలేకపోయారు. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్, అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. బావి వినియోగంలో లేకపోవడంతో పాడుబడింది. నీరు సైతం పాచిపట్టి, తీవ్ర దుర్గంధం రావడంతో సిబ్బంది సైతం బావిలోకి దిగే సాహసం చేయలేకపోయారు. తాడేపల్లి సీతానగరంలోని గజ ఈతగాళ్లను రంగంలోకి దించి గోపాల్ మృతదేహాన్ని బయటకు తీసేందుకు ప్రయత్నించినా చీకటి పడటంతో వీలుపడలేదు. మృతదేహం మంగళవారం ఉదయం నీటిపైకి తేలియాడే అవకాశం ఉందని, అప్పటి వరకూ ఏమీ చేయలేమని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మృతుని కుటుంబ సభ్యులకు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి పెదవడ్లపూడి కొత్త పాలెంలో రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా గమనించి, విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థుల భవితకు జగనన్న బాటలు

- ప్రజా ప్రతినిధుల ప్రశంసలు
- పలు పాఠశాలల్లో జగనన్న ఆణిముత్యాల పురస్కారాల ప్రదానం


వడ్డేశ్వరం హైస్కూలులో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


ఈమని హైస్కూలులో పురస్కారాల పంపిణీ

తాడేపల్లి రూరల్ : మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలలోను, దుగ్గిరాల మండలం ఈమని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం 10వ తరగతిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. తాడేపల్లి వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు కత్తిక రాఘవరావు పాల్గొని, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యలో పెను మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. నాడు- నేడు కింద శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్ని పునరుద్ధరించి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని తెలిపారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన అప్పికట్ల ఉదయనాగ లక్ష్మికి రూ.3వేలు, ద్వితీయ స్థానం సాధించిన పసుపులేటి జాహ్నవికి రూ. 2వేలు, తృతీయ స్థానం సాధించిన వడ్డేశ్వరం కోమలికి రూ. వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొడవర్తి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. సుబ్బారావు, ఉపాధ్యాయులు పి. బుజ్జిబాబు, కె. కాంతారావు, డి.వి. రవణమ్మ, కె. వెంకటేశ్వరరావు, కె. జోజప్ప, రామచంద్రరావు, సీహెచ్‌వీఆర్ సత్యనారాయణ, టి. శ్రీనివాసరావు, డి. శ్రీనివాసరావు, సాయిబాబు, పి. కోటేశ్వరరావు, బి. శ్రీదేవి, సీహెచ్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో....

మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యం విద్యార్థులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈమనిలో బాలికల కోసం ఇంటర్మీడియట్ విద్యను ఉచితంగా ప్రభుత్వం ద్వారా ప్రారంభించామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన పి. నిశిప్రియకు రూ.3 వేలు, ద్వితీయ స్థానం సాధించిన ఎం. పావనికి రూ.2 వేలు, తృతీయ స్థానం సాధించిన మహిమ క్రాంతికి రూ. వెయ్యిని జగనన్న ఆణిముత్యాలుగా అందించారు. 6వ తరగతి నుంచి 11వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ. 15వేలను కె. స్వప్న జ్ఞాపకార్థం పూర్వ విద్యార్థి కె. సుబ్రహ్మణ్యం, రోహిణి ఆర్థిక సహకారంతో అందించారు. కార్యక్రమంలో పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. ఏడుకొండలు , ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాఘవయ్య, ప్రకాశరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బి. కోటయ్య, విద్యా కమిటీ చైర్మన్ బొంతు కోటయ్య, పూర్వ విద్యార్థి అంచె రామమోహన్, ఉపాధ్యాయులు బ్రహ్మేశ్వరరావు, యస్. ప్రకాశరావు, టి. శ్రీనివాసరావు, రాజశేఖర్, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ముత్తే లక్ష్మి, శ్రావణి పాల్గొన్నారు.

భూ సర్వేలు, సివిల్ వివాదాలకు ప్రతి సోమవారం పరిష్కారం

తహసీల్దార్ రాంప్రసాద్

మంగళగిరి: మండలంలో భూ సర్వేలు, ఆక్రమణలు, భూ సంబంధ సమస్యల్ని పరిష్కరించేందుకు రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు అధికారులతో కో-ఆర్డినేట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.వి.రాంప్రసాద్ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు భూమి సర్వేలు, సివిల్ వివాదాలతో ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు అధికారులతో కో-ఆర్డినేట్ సమావేశం నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. సమావేశంలో పట్టణ, రూరల్ పోలీస్ అధికారులు, సర్వేయర్లు పాల్గొంటారన్నారు. తమ పరిధిలో ఉన్న ప్రజల భూ సమస్యల్ని పరిష్కారంతో పాటు వాటికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ను సకాలంలో అందజేస్తామని తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.